నిరుద్యోగ భృతి ఇవ్వరా?



చంద్రబాబు అధికారంలోకి వచ్చి 100 రోజులు కావొస్తున్నా ఇంత వరకు నిరుద్యోగ భృతి ఊసే లేదు. ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలతో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చినా చంద్రబాబు పట్టించుకోవడంలేదు. గతంలో కూడా నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు మోసం చేశారు.

– శివారెడ్డి, నిరుద్యోగి, తాడిపత్రి

ప్రతి మహిళకూ రూ.1500 ఇవ్వాలి



ఓట్ల కోసం ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నేతలు సూపర్ సిక్స్‌లో భాగంగా 18 నుంచి 45 ఏళ్ల లోపు వయసు కలిగిన ప్రతి మహిళకూ ప్రతి నెలా రూ.1500 ఇస్తామని హోరెత్తించారు.ఎన్నికల్లో గెలిచి పగ్గాలు చేపట్టిన తరువాత ఇప్పటి వరకు సీఎం చంద్రబాబు నోరు మెదపలేదు. మహిళలు రూ.1500 ఇస్తారని ఎదురుచూస్తున్నారు.

– లింగం చంద్రిక, పెద్దపప్పూరు

తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారు?



నాకు ముగ్గురు పిల్లలు. ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు ఏటా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామన్నారు. స్కూళ్లు ప్రారంభమై 4 నెలల కావొస్తున్నా ఇంత వరకూ పిల్లలకు డబ్బు ఇవ్వలేదు. రూ.45 వేలు రావాలి.

– ఈశ్వరమ్మ, గోవిందపల్లి, బుక్కరాయసముద్రం మండలం

జీఓ విడుదల చేయాలి



నేను ఎంటెక్ పూర్తి చేశాను. ఉద్యోగావకాశాలు లభించక ఎల్‌ఐసీ ఏజెంట్‌గా కొనసాగుతున్నాను. ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ఇచ్చే వరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తానన్న హామీని నిలబెట్టుకోవాలి. గతంలో మాదిరి అధికారంలోకి వచ్చాక మోసం చేయకూడదు. – సురేంద్రబాబు, ఎంటెక్ విద్యార్థి, గుంతకల్లు.

పంట పెట్టుబడి కోసం అప్పు చేయాల్సిందే



మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. ఇప్పటికే విత్తనాలు, పురుగు మందులు, కలుపు, కూలీల కోసం దాదాపు రూ. లక్ష ఖర్చు పెట్టాను. టీడీపీ అధికారంలోకి వచ్చి 100 రోజులు కావొస్తున్నా చంద్రబాబు రూ.20 వేలు ఇంత వరకూ ఇవ్వలేదు. పంటల సాగు కోసం అప్పులు చేయాల్సిందే.


– దేవేంద్ర, రైతు, పుప్పాల గ్రామం, యాడికి మండలం

తల్లికి శఠగోపం పెట్టారు



నాకు ఒక కుమారుడు ఉన్నాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేతలు సూపర్‌సిక్స్ అని .. తల్లికి వందనం అని ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ సంవత్సరానికి రూ.15వేలు ఇస్తామన్నారు. తీరా ఇప్పుడు వచ్చే ఏడాది నుంచి ఇస్తామంటూ తల్లికి శఠగోపం పెట్టారు.

– సులోచన, నందలపాడు, తాడిపత్రిటౌన్



బాబూ... హామీల అమలు ఎప్పుడు?

- పథకాల అమలుకు సీఎం చంద్రబాబు వెనుకంజ
- 'సూపర్ సిక్స్' అమలు చేయాలని ప్రజల డిమాండ్

సాక్షి నెట్‌వర్క్: అధికారం కోసం హామీలివ్వడం.. ఆ తర్వాత వాటిని తుంగలో తొక్కడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఓట్ల కోసం ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటి ఊసెత్తకపోవడం ఆయనకు అలవాటు. గతంలో కూడా రైతు, డ్వాక్రా రుణాల మాఫీ ఇలా ఒకటేమిటి 650కు పైగా హామీలు ఇచ్చి ఒక్కటీ నిలబెట్టుకోలేకపోయారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో 'సూపర్ సిక్స్' పేరుతో కూటమి నాయకులు హామీలిచ్చారు. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15,000 ఇస్తామన్నారు. రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20,000 ఆర్థికసాయం చేస్తామన్నారు. నిరుద్యోగులకు రూ.3,000 భృతి, ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. ఇక ఉచిత బస్సు ప్రయాణం కోసం తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో 3,53,431 మంది మహిళలు ఎదురుచూస్తున్నారు. అలాగే ఏడాదికి మూడు సిలిండర్ల కోసం 2,39,639 మంది నిరీక్షిస్తున్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు కావొస్తున్నా హామీల అమలు ఊసెత్తడం లేదు. దీంతో ఓటేసిన మహిళలు, రైతులు, నిరుద్యోగులు, ప్రజలు చంద్రబాబు తీరుపై మండిపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీలను వంద శాతం అమలు చేశారు. కూటమి ప్రభుత్వం కూడా హామీలన్నీ అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జగన్ పాలనలో అమ్మఒడి పథకం కింద మహిళలకు అందిన సాయం



నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
తాడిపత్రి	212.08
గుంతకల్లు	191.02
శింగనమల	343.11

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం



నియోజకవర్గాల వారీగా అర్హులు

తాడిపత్రి	33,000
గుంతకల్లు	29,669
శింగనమల	29,183

ఇవ్వాల్సిన సాయం రూ.137.77 కోట్లు



ప్రతి మహిళకూ నెలకు రూ.1500

నియోజకవర్గాల వారీగా అర్హులు

తాడిపత్రి	1,00,000
గుంతకల్లు	85,656
శింగమల	98,645

ఇవ్వాల్సిన సాయం: రూ.42.64 కోట్లు

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం నియోజకవర్గాల వారీగా అర్హులు


తాడిపత్రి	49,536
గుంతకల్లు	30,179
శింగనమల	52,622
ఇవ్వాల్సిన సాయం	264.67 కోట్లు



జగన్ పాలనలో రైతు భరోసా పథకం కింద అందిన సాయం



నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
తాడిపత్రి	79.57
గుంతకల్లు	82.58
శింగనమల	122.56



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాల వారీగా అర్హులు

తాడిపత్రి	50,000
గుంతకల్లు	39,944
శింగనమల	73,956

ఇవ్వాల్సిన సాయం: రూ.49.17 కోట్లు



సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు అందజేస్తామని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రచార పోస్టర్



రైతులకు రూ. 20 వేలు అందజేస్తామంటూ ప్లకార్డు చూపుతున్నతాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి



ఎన్నికలకు ముందు గుంతకల్లు పట్టణంలో నిర్వహించిన ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ హామీ ఇస్తున్న గుమ్మనూరు జయరాం

మహిళలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారు?



ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని మేనిఫెస్టో పెట్టారు. దీంతో టీడీపీ కుటమికి ఓట్లు వేసి గెలిపించాం. మహిళలకు నెలకు రూ1500 ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు కావొస్తున్నా. అయినా మహిళలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు. వెంటనే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– శ్రీకరం, విష్ణుప్రియ, గుత్తి

సాగుకు సాయం చేయరా?



ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పంట సాగు పెట్టుబడికి చాలా ఇబ్బందిగా ఉంది. అన్నదాత సుఖీభవ కింద చంద్రబాబు పంట సాగుకు ఏటా రూ.20 వేలు సహాయం అందిస్తారని చెప్పడంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. అయితే ఖరీఫ్ సమయం పూర్తయినా ఇప్పటికీ పంట సహాయంపై ఎలాంటి ప్రకటన చేయడం లేదు. దీంతో రైతులంతా తీవ్ర నిరాశలో ఉన్నారు.

– సూర్యనారాయణరెడ్డి, ఊటకల్లు, గుత్తి, (మం)

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

తాడిపత్రిటౌన్: యల్లనూరు మండలం చిలమకూరుకు చెందిన చిన్నారి ప్రణతి క్యాన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంఘం నేతలు బుధవారం పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో చిన్నారి తండ్రి గంగరాజుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేసారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కుమ్మర గురప్ప ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, కన్వీనర్ నారబోయిన శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణ్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కుమారస్వామి, సభ్యులు రామేశ్వరెడ్డి, మహబూబ్ భాషా, వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ వెంకటయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

భర్త కోసం రైల్లో నుంచి కిందకు దూకిన భార్య

గుత్తి: గుత్తిలో బుధవారం అనూష అనే మహిళ తన భర్త కోసం రైల్లో నుంచి కిందకి దూకింది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌కు చెందిన భార్యాభర్తలు గోపినాథ్, అనూష రాజంపేటకు వచ్చారు. రాజంపేట నుంచి పూనే ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ బోగీలో ప్రయాణం చేశారు. అయితే గుత్తిలోని ప్లాట్ ఫారం –2లో రైలు ఆగింది. గోపీనాథ్ నీటి కోసం కిందకు దిగాడు. రైలు కదలినా భర్త రాకపోవడంతో అనూష రైల్లో నుంచి కిందకు దూకింది. అయితే అదృష్టవశాత్తూ స్వల్పగాయాలతో బయట పడింది. ఈ సంఘటనపై జీఆర్‌పీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్వచ్ఛ గుంతకల్లుగా తీర్చిదిద్దుకుందాం



మెయిన్ రోడ్డులో చెత్త ఊడుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: ప్రజలందరి సహకారంతో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ వెంకట రమణయ్య తెలిపారు. బుధవారం పట్టణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్డులో చెత్తను ఊడ్చేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దుకునేందుకు కంకణబద్ధులవుతామని ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఆర్ఓ నాసిర్, మెప్మా టీపీఆర్ఓ మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, టీడీపీ నాయకుడు నారాయణ స్వామి పాల్గొన్నారు.

ర్యాలీ..

గుత్తి: మున్సిపాలిటీలో బుధవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్ పర్సన్ వన్నూర్ బీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. గాంధీ సర్కిల్ వద్ద కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై పోలీసులకు ఫిర్యాదు



సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: చెదుల్ల గ్రామంలో తమ కుమార్తె శ్రావణిపై దాడికి ఉసిగొల్పిన టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ నారాయణస్వామిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహారెడ్డి కోరాడు. ఈ మేరకు జెడ్పీటీసీ భాస్కర్‌తో కలసి ఆయన బుధవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశాడు. నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నారాయణస్వామి ప్రోద్బలంతో వాటర్ ప్లాంట్, కంచెను జేసీబీతో తొలగించాలని రెచ్చగొట్టారన్నాడు. దీంతో బండి మల్లికార్జున, బండి పెద్దక్క, బండి ఓబిలేసు, బండి శివయ్య, బండి కార్తీక్, బండి చౌడమ్మ బండి నాగలక్ష్మి, అనే వ్యక్తులు తమ కుమార్తె శ్రావణిపై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. ఈ గొడవకు నారాయణస్వామే కారణమన్నాడు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రస్తుత సర్పంచ్ అయిన శ్రీనివాసరెడ్డిపై దౌర్జన్యానికి దిగుతున్నాడని ఆరోపించాడు. కార్యక్రమంలో చికెన్ నారాయణస్వామి, బయపరెడ్డి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మి నారాయణ, దయ్యాలకుంటపల్లి సర్పంచ్ రమేష్, రంగ నాయకులు, రుషింగప్ప పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: గన్నెవారిపల్లి కాలనీలో బుధవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.5 వేల నగదు, ఐదు మోటర్ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వివాహిత అదృశ్యం

గార్లదిన్నె: గార్లదిన్నెకు చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా బుధవారం మీడియాకు తెలిపారు. వడ్డే జయలక్ష్మి అనే వివాహిత ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు ఎన్నిచోట్ల వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు.

హోటల్లోకి దూసుకెళ్లిన ఆటో

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా బుధవారం ఓ ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న హోటల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో హోటల్లో కూర్చొని ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆర్ఎస్ నుంచి గుత్తికి వెళుతున్న ఆటో బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న హోటల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడామైదానంలో ఈనెల 20, 21 తేదీల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల బాలికలకు స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఎస్ హైస్కూల్ పీఈటీ పుష్పరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు.

తలనీలాల సేకరణకు వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు సమర్పించే తలనీలాల సేకరణకు బుధవారం వేలం పాట నిర్వహించారు. ఆలయ ఈఓ నాగేంద్రుడు ఆధ్వర్యంలో రూ.20 వేలు చెల్లించి ఆరుగురు వేలం పాటలో పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన వేలం పాటలో గ్రామానికి చెందిన లక్ష్మీదేవి రూ.1.82 లక్షలకు వేలం పాట దక్కించుకుంది. గతేడాది రూ.1.80 లక్షలకు పలికిన వేలం.. ఈ ఏడాది రూ.2 వేలు అదనంగా ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో గ్రామస్తులు రంగస్వామి రెడ్డి యాదవ్, మద్దిలేటి, శంకర్ పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా పూర్వాభాద్ర హోమం

గుంతకల్లు రూరల్: నెట్టికంటి ఆంజనేయ స్వామి జన్మనక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం పూర్వాభాద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మన్యుసూక్తహోమాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

బాణాసంచా దుకాణాలపై దాడులు



యాడికిలో స్వాధీనం చేసుకున్న టపాసులు


తాడిపత్రి అర్బన్: పట్టణంలో అక్రమంగా బాణాసంచా విక్రయాలు సాగిస్తున్న దుకాణాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అర్బన్ సీఐ సాయిప్రసాద్ పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని రాజా ఎలక్ట్రానిక్స్, మరో జనరల్ స్టోర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం టపాసుల విక్రయించే దుకాణదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

తాడిపత్రి: యాడికిలోని పలు టపాసుల విక్రయాల దుకాణాలపై బుధవారం దాడులు నిర్వహించారు. తాడిపత్రి డీఎస్పీ జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో యాడికి సీఐ ఈరన్న సిబ్బందితో కలసి అనుమతులు లేకుండా టపాసుల విక్రయిస్తున్న దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. దుకాణదారుల నుంచి బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు.

ఈ–కేవైసీ తప్పకుండా చేయించాలి

గుత్తి రూరల్: పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పకుండా ఈ–కేవైసీ చేయించుకోవాలని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. మండలంలోని గొందిపల్లి, కొత్తపేట గ్రామాల్లో బుధవారం ఏడీఏ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి ఈ–కేవైసీ ప్రయోజనాలను వివరించారు. ఈ–కేవైసీ చేయించుకోని పక్షంలో ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు వర్తించవన్నారు. ఇప్పటి వరకూ ఈ–కేవైసీ చేయించుకోని రైతులు వెంటనే గ్రామ సచివాలయాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి చేయించుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వేరుశనగ, ఆముదం, పత్తి, సజ్జ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఎంపీఈఓ అరుణ, వీఏఏ స్వాతి పాల్గొన్నారు.

పోడియం పోయె.. టేబుల్ వచ్చె!



సాధారణ కుర్చీలో కూర్చొని విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ శివనారాయణ

తాడిపత్రిటౌన్: తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సబ్ రిజిస్ట్రార్ పోడియం తొలగించారు. కార్యాలయంలో ఎత్తయిన పోడియంపై కూర్చొని సబ్ రిజిస్ట్రార్ విధులు నిర్వర్తించేవారు. ఇది రాచరికపు పోకడను తలపిస్తోందని భావించిన ప్రభుత్వం పోడియం తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగించి టేబుల్, కుర్చీలు ఏర్పాటు చేశారు. సబ్ రిజిస్ట్రార్ శివనారాయణ సాధారణ కార్యాలయాల్లో మాదిరిగానే కుర్చీ, టేబుల్‌పైనే విధులు నిర్వర్తించారు.